

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మాజీ ఎంపీపీ పసుపులేటి లక్ష్మి దేవేంద్రం

ఖమ్మం,ఏప్రిల్ 23(ప్రజాక్షేత్రం):ముదిగొండ మండల పరిధిలోని న్యూ లక్ష్మీపురం గ్రామంలో సొసైటీ వారి ఆధ్వర్యంలో వడ్లు మార్క్ ఫీడ్ కొనుగోలు కేంద్రం ముదిగొండ మండలం మాజీ ఎంపీపీ పసుపులేటి లక్ష్మి దేవేంద్రం ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ వెంకటరత్నం ఏఈఓ లిఖిత, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు మహమ్మద్ అజ్గర్,మాజీ సర్పంచ్ వాగదాని కన్నయ్య, మండల కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు పోతురాజు పురుషోత్తం యాదవ్,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కోరట్ల పద్మ,గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొట్టే శ్రీనివాసరావు,ఊరుకొండ రాజు,సయ్యద్ రఫీ కొట్టే శ్రీరాములు,చెరుకూరి నాగేశ్వరరావు,సయ్యద్ నాగుల్ మీరా,బర్ల రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన..!

**పెద్దపల్లి ఎమ్మెల్యే సి.హెచ్ విజయరమణ రావు**

**సుల్తానాబాద్/ఎలిగేడు, ఏప్రిల్ 23(ప్రజాక్షేత్రం):**ఎలిగేడు మండలంలోని సుల్తాన్ పూర్ గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మరియు ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా మరియు ఎ.ఎ.పి నిధులు, స్పెషల్ ఫండ్స్ ద్వారా నూతన వంట గది, మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు మరియు ఇతర పనులకు 43,00,000/ లక్షల రూపాయల నిధులతో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపల్లి ఎమ్మెల్యే సి.హెచ్ విజయరమణా రావు శంకుస్థాపన చేసి ప్రారంభించారు.అనంతరం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎమ్మెల్యే స్వయంగా భోజనాన్ని వడ్డించారు.ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్, మాజీ సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షులు, పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పాల్గొన్నారు.



# ప్రకృతి పుత్రుని కుటుంబానికి మాజీ ఎంపీ నామ సహాయం

**పద్మశ్రీ వనజీవి రామయ్య దశదిన కర్మ నిమిత్తం నామ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం**



**ఖమ్మం,ఏప్రిల్ 23(ప్రజాక్షేత్రం):**ఇటీవల పరమపదించిన ప్రముఖ పర్యావరణవేత్త,పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య దశదిన కర్మ గురువారం జరగనున్న నేపథ్యంలో ఆయన కుటుంబానికి ఆర్థికంగా తోడుగా నిలవాలనే ఉద్దేశ్యంతో బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత,ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదేశాల మేరకు నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ద్వారా కొంత నగదు సహాయాన్ని అందించారు. ఇటీవల రామయ్య స్వగృహానికి నామ వచ్చినప్పుడు వారి కుటుంబానికి అండగా వుంటానని రామయ్య కుటుంబ సభ్యులకు నామ చెప్పడం జరిగిందని అందులో భాగంగా ఈ సాయాన్ని బుధవారం నాడు ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి లో రామయ్య స్వగృహం లో వారి సతీమణి జానమ్మకు బీఆర్ఎస్ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్,నామ క్యాంప్ కార్యాలయ ఇంచార్జి కనకమేడల సత్యనారాయణ అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనజీవి రామయ్య పర్యావరణ పరిరక్షణ కోసం చేసిన సేవలు భారతదేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు.చెట్లను మనుషులుగా చూస్తూ వాటిని సంరక్షించడం ఆయన జీవిత ధ్యేయంగా మారిందని పేర్కొన్నారు.ఆయన జీవితం ప్రకృతి పట్ల ప్రేమ,పట్టుదల, త్యాగానికి చిరునామా అన్నారు.నామ నాగేశ్వరరావు గతంలో కూడా పలు సందర్భాలలో వనజీవి రామయ్యని వ్యక్తిగతంగా కలుసుకుని,ఆయన సేవలను అభినందించారని,అంతే కాకుండా వారి చేసే కార్యక్రమాలకు నామ తోడ్పాటు అందజేసిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేశారు.దశదిన కర్మకు అవసరమైన ఖర్చులను కొంతవరకూ భరించేందుకు ముందుకొచ్చిన నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ కి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సమయాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా మానవతా విలువలతో స్పందించటం అభినందనీయం అని పలువురు ప్రజాప్రతినిధులు వ్యాఖ్యానించారు.వనజీవి రామయ్య తన జీవితాంతం వృక్షాలను ప్రేమిస్తూ ,వాటి పరిరక్షణకే తన జీవితాన్ని అంకితంగా గడిపారని తెలిపారు.వనజీవి రామయ్య మహోన్నత వ్యక్తి అని వారి కుటుంబానికి అండగా నిలవడం మన బాధ్యత అన్నారు.నామ నాగేశ్వరరావు నిరంతరం ప్రజల కోసం పాటుపడే నాయకుడే కాకుండా మానవతావాదిగా ఆయన చేసే సేవ కార్యక్రమాలు ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ బీఆర్ఎస్ నాయకులు పేరం వెంకటేశ్వర్లు,గొడ్డేటి మాధవరావు,వాకాదని కోటేశ్వరరావు,పాల్వంచ రాజేష్,బానోత్ కృష్ణ,శీలం రవికుమార్,ఏపూరి తరుణ్, మేకల ఉదయ్ కుమార్, ఆలకుంట వెంకటేష్, డి.ఎల్లయ్య,పి.ఎల్లయ్య, డి.బాబు,పి.లక్ష్మయ్య, జి.వెంకటేష్,కళ్లెం సీతయ్య, ఎరపుల రాజా,ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## అవని

పంచభూతాలలో నొకదానిని,
సహనంలో సహజత్వాన్ని,
మీ పాప పుణ్యాలకు ప్రత్యక్ష సాక్షిని,
జన్మ జన్మలకు నేనేరా నీ మాతృమూర్తిని,
శత్రువులు-మిత్రులు, రాళ్లు -రప్పలు,
నదులు-సముద్రాలు, చెట్లు -పుట్టలు,
అందరూ నావాళ్లే, నన్ను వీడనివారే,
అవతార పురుషుల పాదస్పర్శ తో
పులకించితిని,
మూర్ఖుల పాపపు చేష్టలుతో
కలవరించితిని,
లోలోని జ్వాలాగ్నిలును రగిలిన
ప్రశాంతతే
నా చిరునామా,
నా చిరాకు నీకు విషాదం సుమా!

రచన :- శివ్వాం కిరణ్ కుమార్
ప్రధానోపాధ్యాయులు
డి. ఎ. వి. హై స్కూల్
సీలేరు,



## ఏసీబీ వలలో చిక్కిన ఇద్దరు ఎస్సారెస్పీ అధికారులు

**సుల్తానాబాద్, ఏప్రిల్ 23(ప్రజాక్షేత్రం):**సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఏసీబీ అధికారుల వలలో ఎస్సారెస్పీ అధికారులు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఎస్సారెస్పీకి చెందిన ఇద్దరు అధికారులు ఏసీబీ వలలో చిక్కారు. బుధవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ ఎస్సారెస్పీ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20వేల రూపాయల లంచం తీసుకుంటుండగా సుల్తానాబాద్ ఎస్సారెస్పీ డివిజన్ 6 సూపరింటెంట్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ సురేష్ పట్టుబడ్డారు. ఇదే కార్యాలయంలో పని చేస్తున్న ఇజాజ్ అనే ఉద్యోగి సిక్ లీవ్ పెట్టగా, అది ధృవీకరించేందుకు గాను 20వేల రూపాయలు లంచం అడగ్గా, బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి, దాడులు నిర్వహించారు. ఈ మేరకు సూపరింటెంట్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ సురేష్ లకు కెమికల్ టెస్ట్ నిర్వహించగా నిర్ధారణ అయిందని ఏసీబీ అధికారులు తెలిపారు.అనంతరం అవినీతికి పాల్పడ్డ ఇద్దరు ఎస్సారెస్పీ అధికారులను అరెస్ట్ చేసి, కరీంనగర్ ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరుపరుచనున్నామని ఏసీబీ అధికారులు తెలిపారు.



## ఆగి ఉన్న లారీని ఢీ కొట్టిన ఆటో..!

- **ఆటో డ్రైవర్ కు తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం**
- **కరీంనగర్ లోని ఓ ఆసుపత్రికి తరలింపు**

**సుల్తానాబాద్, ఏప్రిల్ 23(ప్రజాక్షేత్రం):**రోడ్డు పక్కకు ఆగి ఉన్న లారీని, ఢీ కొట్టిన ఆటో డ్రైవర్ కు తీవ్ర గాయాలైన సంఘటన సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి గ్రామం వద్ద ఈ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామానికి చెందిన అజయ్ అనే వ్యక్తి ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం సమయంలో ఆటోను తీసుకొని కరీంనగర్ కు బయలుదేరాడు. తిరుగు ప్రయాణంలో కరీంనగర్ నుంచి కాట్నపల్లి గ్రామం వద్దకు రాగానే, రోడ్డు పక్కకు ఆగి ఉన్న లారీని,ఆటో బలంగా ఢీ కొట్టింది. ఆటో డ్రైవర్ అజయ్ కి తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న స్థానికులు వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ లోని ఓ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలానికి చేరుకున్న సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ కుమార్ కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### బీఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలకు
# పెద్దఎత్తున తరలి రావాలి

- **తెలుగు రాష్ట్రాల్లోని అందరి చూపు బీఆర్ఎస్ సభపైనే**
- **గ్రామ గ్రామాన పండుగ వాతావరణం**
- **దేశంలోనే లక్ష మంది పాల్గొని అతిపెద్ద సభగా, ఈ రజతోత్సవ సభ**
- **సుమారు 1300 ఎకరాల్లో ఈ సభాస్థలి ఏర్పాటు**
- **కేసీఆరే మళ్లీ రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారు**
- **ఆరు గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెసోళ్లు ఈ సభతో గజగజ వణుకుడు కాయం**
- **పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల నుండి పెద్ద సంఖ్యలో తరలిరావాలి**
- **సభకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్న గులాబీ దళం**
- **పెద్దపల్లి మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ కవిత**

పెద్దపల్లి, ఏప్రిల్ 23(ప్రజాక్షేత్రం):బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి లో ఈనెల 27న నిర్వహిస్తున్న రజతోత్సవ సభ( సిల్వర్ జూబ్లీ వేడుకల)కు పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం పెద్దపల్లి పర్యటనకు విచ్చేసిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పెద్దపల్లి లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజల కోసం పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చెప్పే మాటలను గ్రామాల్లో వివరించాలని కోరారు. ఈ రజతోత్సవ సభ వైపు యావత్ దేశం, కోట్లాదిమంది ప్రజలు ఎదురు చూస్తున్నారని, కేసీఆర్ ఏం మాట్లాడుతారోననే అనే ఉత్కంఠ ప్రజల్లో నెలకొందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. సుమారు 1300 ఎకరాల్లో పెద్ద ఎత్తున నిర్వహించే సభకు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నారని, సభకు వచ్చే ప్రజలకు సమస్యలు తలెత్తకుండా త్రాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు పెద్ద ఎత్తున సమకూరుస్తున్నారని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలంతా మళ్లీ కేసీఆరే సీఎం కావాలని కోరుకుంటున్నారని హర్ష వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లా నుండి వచ్చినటువంటి మద్దతు తెలంగాణ రాష్ట్రం ఏర్పడడంలో అత్యంత కీలకపాత్ర వహించిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. తెలంగాణ ఏర్పాటు విషయంలో ఇదే ప్రాంతానికి చెందిన రామగుండం,తదితర ప్రాంతాలకు చెందిన సింగరేణి బొగ్గు గని కార్మికులు తట్టా,పార పక్కకు పడేసి ఆందోళనకు దిగితే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన విషయం చూసామని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 25 నుండి వచ్చేనెల 25 వరకు, నెల రోజులపాటు ఈ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని సూచించారు. ఆరు గ్యారంటీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు నోటికి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని, ఇవన్నీ తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీరు, త్రాగు నీరు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ, రైతుబంధు, రైతు భరోసా, ఆడబిడ్డలకు 2500 వంటి పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని చెప్పి,ఆ మాటలన్నిటినీ గాలికి వదిలేసారని మాట్లాడారు. సభకు ఎన్ని అడ్డంకులు వేయాలని చూసినా, మీ ఉడుతా ఊపు బెదిరింపులకు భయపడేలేదని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, పెద్దపల్లి, రామగుండం, మంథని మాజీ ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, పుట్ట మధు, టీఎస్ టిఎస్ మాజీ చైర్మన్ రాకేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి, దాసరి ఉష, పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్, ఓదెల మాజీ జెడ్పిటిసి గంట రాములు యాదవ్, జిల్లా జాగృతి అధ్యక్షుడు పెంట రాజేష్, పెద్దపల్లి బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజ్ కుమార్, పెద్దపల్లి, సుల్తానాబాద్ మాజీ ఎంపీపీలు బండారి స్రవంతి శ్రీనివాస్ గౌడ్, బాలాజీ రావు, బీఆర్ఎస్ నాయకులు బొల్లం భూమేష్, ముద్దసాని సంధ్యారాణి, హారిక, అరుణ మరియు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు





## పేద ప్రజలకు వరం సన్నబియ్యం పంపిణీ

- **వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి**
- **కలెక్టర్ తో కలిసి సన్న బియ్యంతో సహా పంక్తి భోజనం చేసిన ఎమ్మెల్యే**

**వనపర్తి ప్రతినిధి ఏప్రిల్ 22(ప్రజాక్షేత్రం)** పేద ప్రజలకు సైతం ఉన్నత వర్గాల ప్రజలు తినే సన్న బియ్యాన్ని ఇవ్వాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం 3.10 కోట్ల మంది ప్రజలకు ఒక్కొక్కరికి నెలకు 6 కిలోల చొప్పున ఉచితంగా సన్న బియ్యం ఇవ్వడం జరుగుతుందని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు. బుధవారం శ్రీరంగాపూర్ మండలంలోని పశువుల వెంకటయ్య, మంజుల అనే లబ్ధిదారుని ఇంట్లో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో కలసి సహపంక్తి భోజనం చేశారు. ప్రభుత్వం చౌకధర దుకాణం ద్వారా ఇచ్చిన సన్న రకం బియ్యం నాణ్యత ఎలా ఉంది అనేది స్వయంగా తిని తెలుసుకున్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అందులో భాగంగానే చౌక ధర దుకాణం ద్వారా పేద ప్రజలకు సన్న రకం బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఇందిరమ్మ ఇల్లు కావాలా అని పశువుల వెంకటేష్ వారి సతిమణి మంజుల ను అడిగి తెలుసుకున్నారు. స్పందించిన కుటుంబ సభ్యులు సన్న బియ్యం అన్నం ఎంతో రుచికరంగా ఉందని ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి ఫోటో దిగారు. రుచికరమైన భోజనం పెట్టినందుకు పర్వతాలకు జిల్లా కలెక్టర్, శాసన సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, తహసిల్దార్ మురళి, ఇతర మండల అధికారులు తదితరులు ఉన్నారు.

## రెచ్చిపోతున్న ఇసుక మాఫియా



**షాబాద్ ఏప్రిల్ 23(ప్రజాక్షేత్రం)**

షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో రోజు రోజుకు రాత్రి, పగలు సమయంతో తేడా లేకుండా ఇసుక మాఫియా రెచ్చిపోతుంది. ఇసుక మాఫియా తమకు నచ్చిన రేటుకు హైతబాద్ లో 6000 లకు, మిగతా ప్రాంతాలకు 8000, 10,000 రూపాయలకు ఇసుకను అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఎన్ని రకాలుగా చర్యలు తీసుకున్న, నిరోధక చర్యలు చేపట్టిన వాళ్ళ కళ్ళు కప్పి ఇసుక మాఫియా హవా చెలయిస్తుంది. గత నెల క్రితం పోలిసులు ఇసుక మాఫియా దారులను పట్టుకున్న వారిలో ఎటువంటి భయం, అడ్డు అదుపు లేకుండా తమ వ్యాపారాన్ని వాళ్ళు సాగించుకుంటున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి తమ ఆస్తులను సంపాదించుకుంటున్నారు. ఈ సి వాగు ఇసుక మాఫియా దారుల పాలిట వరం అయిందనడంలో ఎలాంటి సందేహం లేదని చెప్పాలి. ఇన్ని రోజులుగా ఎంత వరకు సంపాదించి వుంటారో ఊహకు అందని విషయం మరి ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆదాయానికి, ఈ సి పరివాహక ప్రాంతాల్లో పరిసరాల సమతుల్య పాటించే విధంగా చర్యలు తీసుకోవాలనీ స్థానికులు కోరుతున్నారు.



